# వేలానికి 'స్వగృహ'



## కాసుల వేటకు ప్రభుత్వం సన్నద్ధం

- మధ్యతరగతి ప్రజల ఆశలపై నీళ్లు
- ఇప్పటికే నాటి అడ్వాన్స్‌లు వెనక్కు
- రాష్ట్ర వ్యాప్తంగా వేలం నిర్వహణ
- మార్చి ద్వితీయార్థంలో ఖమ్మం మినహా మిగిలిన చోట్ల యాక్షన్

**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

ప్రభుత్వ కాసుల వేటలో సర్కారు స్థలాలను ఒక్కొక్కటిగా అమ్ముతూ రూ.లక్షల కోట్లు కూడబెట్టేందుకు యత్నిస్తోంది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008లో నెలకొల్పిన రాజీవ్ స్వగృహ ఇండ్ల స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లు విక్రయించేందుకు సిద్ధమైంది. జీహెచ్‌ఎంసీలో ఈ-వేలం నిర్వహిస్తారు. మిగిలిన చోట్ల భౌతికవేలం నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ బాధ్యతను పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐఐసీ)కు అప్పగించింది. ఈ సంస్థ అధికారులు జిల్లాల్లో వేలం నిర్వహణలో కలెక్టర్లకు సహకరిస్తారు.

రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకుగాను ఖమ్మం మినహా మిగిలిన చోట్ల 14, 15, 16, 17 తేదీల్లో జిల్లాల వారీగా వేలం నిర్వహించనున్నారు. ఖమ్మంలో నిర్మాణాలు పూర్తయిన నేపథ్యంలో దీనిపై ఇంకా మార్గదర్శకాలు వెలువడలేదని టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ పవన్ స్పష్టం చేశారు. మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో 1,408 ప్లాట్లను వేలం వేయడం ద్వారా రూ.800 కోట్ల వరకు రాబట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. వేలానికి వీలుగా ఉన్న ప్రాజెక్టుల లేఔట్లను ఇప్పటికే సిద్ధం చేసిన అధికారులు.. ఈనెల 18న, వచ్చేనెల 7న ప్రిబిడ్ నిర్వహించనున్నారు. గతేడాది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూములకు హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ ఈ-వేలం నిర్వహించడంతో భారీ స్పందన వచ్చింది. సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం లభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వగృహ భూములనూ వేలం వేసి భారీ మొత్తంలో ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్లాట్లు చదరపు గజానికి కనీస ధర రూ.5వేల నుంచి రూ.40వేలుగా నిర్ధారించినట్టు టీఎస్ఐఐసీ అధికారులు తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని రాజీవ్ స్వగృహ పథకానికి శ్రీకారం చుట్టింది. మధ్యతరగతి వారికి మార్కెట్ ధరతో పోలిస్తే 25% తక్కువ ధరకు ఇండ్లు నిర్మించి ఇచ్చే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించింది. తెలంగాణలో హైదరాబాద్ జీహెచ్ఎంసీ సహా 15 చోట్ల రాజీవ్ స్వగృహ ప్రాజెక్టులను ప్రారంభించారు. వివిధ కారణాలతో ఇవి మధ్యలో నిలిచిపోయాయి. చాలాచోట్ల ఓపెన్ ప్లాట్లతో పాటు నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లు, ఇండ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న ఇండ్ల స్థలాలను వేలం ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం(జలజ)లో నిర్మాణాలు పూర్తయ్యే దశకు చేరిన నేపథ్యంలో వేలం తేదీని త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

### ఖమ్మంలో నిర్మాణాలు ఇలా...

ఖమ్మం జిల్లాకు మంజూరైన రాజీవ్ స్వగృహ ఇండ్ల సముదాయాన్ని (జలజ ప్రాజెక్టు) ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 9.23 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్లతో నిర్మాణం ప్రారంభించిన రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్లపై నాటి ప్రభుత్వం సుమారు రూ.72 కోట్లు ఖర్చు చేసింది. తర్వాత చోటు చేసుకున్న పరిణామాలతో మధ్యలో నిర్మాణాలు ఆగిపోయాయి. మొత్తం 8 బ్లాక్‌లు, ఒక్కో బ్లాక్‌లో తొమ్మిది ఫ్లోర్లు, ఒక్కో ఫ్లోర్‌కు 8 ఫ్లాట్ల చొప్పున మొత్తం 578 ఇండ్లు ఉన్నాయి. వాటిలో రెండు పడక గదుల ఇండ్లు 288 కాగా.. ఒక్కో ఇంటి విస్తీర్ణం 1,135 చదరపు అడుగులు. మూడు పడక గదుల ఇండ్లు 288 ఉన్నాయి. ఒక్కో ఇంటి విస్తీర్ణం 1,435 చదరపు అడుగులు. ఇండ్ల నిర్మాణం మొత్తం 7,00,600 చదరపు అడగులుగా ఉంది. రెండో ఫేజ్ నిర్మాణం కోసం కేటాయించిన మరో ఏడు ఎకరాలు ఖాళీగానే ఉంది. ఎకరం రూ.3 కోట్లు ఉంటుంది. మొత్తం 16 ఎకరాల స్థలమే దాదాపు రూ.50 కోట్ల విలువ చేస్తుందని అంచనా. 2018లో ఉద్యోగసంఘాల నేతలు స్వగృహ సముదాయాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చినా ప్రభుత్వం అంగీకరించకపోవడం గమనార్హం. ఇప్పుడీ అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లను చదరపు అడుగు రూ.2,500 వరకు నిర్ణయించే అవకాశం ఉంది. ఈ ఫ్లాట్ల అమ్మకం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.200 కోట్ల వరకు ఆదాయం సమకూరవచ్చని అధికారుల అంచనా.

### వేలం దిశగా సన్నాహాలు..

వేలం దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా రాజీవ్ స్వగృహ మిషన్ నుంచి బాధ్యతలను టీఎస్ఐఐసీకి అప్పగించింది. ఇటీవల ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ స్వగృహ సముదాయాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ అధికారులు సముదాయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. రెవెన్యూ అధికారులు ఖాళీ స్థల సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు పక్కనే ఉన్న మున్నేరు బఫర్‌జోన్ గుర్తించి మార్కింగ్ పూర్తి చేశారు. ఇండ్ల నిర్మాణం సందర్భంగా డబుల్ బెడ్రూంకు రూ.3,000, ట్రిబుల్ బెడ్రూంకు రూ.5,000 చొప్పున చెల్లించిన వారి అడ్వాన్స్‌లను తిరిగి ఇచ్చేస్తున్నారు. ఇండ్లు కేటాయించే పరిస్థితి లేదని భావించి మొదట్లోనే చాలా మంది అడ్వాన్స్‌లు వెనక్కు తీసుకున్నారు. మిగిలిన 70 మందికి పైగా ఉన్న అడ్వాన్స్‌లను తిరిగి ఇచ్చేస్తున్నారు.

### మధ్య తరగతి ప్రజలకు అన్యాయం



మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్వగృహ ఇండ్లను వారికే ఇవ్వడం సముచితం. అలా కాకుండా ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సామాన్యులకు అన్యాయం చేయడమే. నాడు అడ్వాన్స్‌లు చెల్లించిన వారందరికీ తక్కువ ధరకు ఫ్లాట్లు కేటాయించాలి. లాభాపేక్షతో ప్రభుత్వం వేలం వేసి పోటీ పెట్టడం మూలంగా సామాన్యులకు అన్యాయం జరుగుతుంది. ధర భారమై పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను అమ్మే చర్యలను విరమించుకోవాలి.

**- నున్నా నాగేశ్వరరావు- సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి**

## గ్రామ సమస్యలు పరిష్కరించాలని..

- లేగదూడకు వినతిపత్రమిచ్చిన గ్రామస్తులు



**నవతెలంగాణ-విద్యానగర్**

అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కుండిషేకుగూడ వాసులు వినూత్న నిరసన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట వారు చేపడుతున్న నిరవధిక దీక్షలు ఆరో రోజుకు చేరాయి. అధికారులు స్పందించకపోవడంతో ఆదివారం లేగదూడకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ మాట్లాడుతూ.. కుండిషేకుగూడ ఆదివాసులు ఆరు రోజులుగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. గూడెం వాసులు ఏండ్లుగా కనీస సదుపాయాలైన తాగునీరు, రోడ్డు సౌకర్యానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు అత్రం నగేష్, గ్రామస్తులు గంగారాం, దౌలత్‌రావు, చందు, సుంగు, జైతు, లింగుబాయి, నాగోరావు, ఆత్రం రేణుక, జంగుబాయి పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**నవతెలంగాణ-దండేపల్లి**

అప్పుల బాధతో రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. ఏఎస్ఐ పాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అప్పల నారాయణ(46) ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి రెండేండ్ల కిందట గ్రామానికి తిరిగొచ్చాడు. స్వదేశానికి వచ్చిన ఆయన వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే పంట పెట్టుబడి నిమిత్తం దాదాపు రూ.3లక్షలు అప్పులు చేశారు. సరైన దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే స్థోమత లేక మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

# బీజేపీ మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించండి

## సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి




**నవతెలంగాణ-చౌటుప్పల్**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించాలని సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్యాలయాల్లో మతం, కులం పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతుందని విమర్శించారు. అందరికి స్వేచ్ఛగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. సుప్రీంకోర్టు సామరస్యంగా వ్యవహరించి పౌరుల హక్కులను కాపాడాలన్నారు. బీజేపీ నాయకత్వం మత ప్రచారాన్ని ఆపాలని, ఇది ఇలాగే కొనసాగితే దేశం అల్లకల్లోలం అయ్యే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ ముచ్చింతల్‌లో ఏర్పాటు చేసిన రామానుజన్ సమతామూర్తి విగ్రహాన్ని సనాతనధర్మం కోసం వాడుతున్నారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్‌శక్తులకు అనుకూలంగా ఉందన్నారు. దాంతో పేదరికం మరింత పెరుగుతుందని, సమస్యలు మరింత పెరుగుతాయని తెలిపారు. చిన్న పరిశ్రమలకు రాయితీలు తగ్గించి..ప్రభుత్వరంగ సంస్థలను అమ్మాలని కేంద్రం చూస్తున్నదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితుల మీద దాడులు పెరిగాయన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో ప్రజలను చైతన్యపరిచి ఉధృతంగా పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, రొడ్డ అంజయ్య, మండల, మున్సిపల్ కార్యదర్శులు గంగదేవి సైదులు, బండారు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డీ పాషా, గడ్డం వెంకటేశం పాల్గొన్నారు.

# హైదరాబాద్ నలుదిశలా ఐటీ విస్తరణ

- పురపాలక, పట్టణాభివృద్ధి,ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- ఉప్పల్‌లో జెన్ ప్యాక్ట్ విస్తరణకు శంకుస్థాపన



**నవతెలంగాణ-ఉప్పల్**

హైదరాబాద్ నలుదిశలా ఐటీని విస్తరించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తూర్పు హైదరాబాద్‌లో లక్ష మంది ఉద్యోగులు పనిచేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఆదివారం ఉప్పల్‌లో జెన్ ప్యాక్ట్ విస్తరణకు మంత్రి మల్లారెడ్డితో కలిసి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ చుట్టుపక్కల ఐటీ బాగా విస్తరించిందని, జెన్‌పాక్ట్ సంస్థ హైదరాబాద్ నలుదిశలా 20 లక్షల చదరపు అడుగుల్లో కొత్త సంస్థల్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. జెన్ ప్యాక్ట్ విస్తరణ పూర్తయితే లక్ష మంది ఐటీ ఉద్యోగులకు వసతి కల్పించేలా రెసిడెన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపొందిస్తున్నామని తెలిపారు. తూర్పు ప్రాంత అభివృద్ధి కోసం నాగోల్‌లో శిల్పారామం ఏర్పాటు చేశామని తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఈ ప్రాంతంలోనే ఉందని చెప్పారు. ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు, ఉప్పల్ జంక్షన్‌లోనూ స్కైవాక్ నిర్మాణం జరుగుతోందన్నారు. పశ్చిమ హైదరాబాద్‌కు దీటుగా తూర్పు హైదరాబాద్ ఎదుగుతోందని అన్నారు. ఇక్కడ ఐటీ పార్కుల నిర్మాణానికి డెవలపర్లు ముందుకొస్తున్నట్టు తెలిపారు. ప్రయివేటు డెవలపర్లకు ప్రభుత్వం తప్పకుండా మద్దతిస్తుందని హామీ ఇచ్చారు. జెన్‌ప్యాక్ట్ వరంగల్‌లోనూ విస్తరిస్తున్నందుకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రామ్కీ ఎన్విరో మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

- కేసు నమోదు చేయకుంటే ఎల్లుండి ధర్నాలు :కాంగ్రెస్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఏఐసీసీ నేత రాహుల్ గాంధీపై అసోం ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్ర కాంగ్రెస్ ఖండించింది. ఆదివారం గాంధీభవన్‌లో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం మూడున్నర గంటల పాటు జరిగింది. అనంతరం మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ అసోం ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తామనీ, కేసు నమోదు చేయకుంటే మంగళవారం పోలీస్ స్టేషన్ల ముందు ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డితో కలిసి తాను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. 18న మహిళా నేతలు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తారని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో 32 లక్షల డిజిటల్ సభ్యత్వ నమోదు చేశామన్నారు. 50 లక్షల డిజిటల్ సభ్యత్వాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మెన్ చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర తెలియకున్నా ప్రధాని మోడీ అంతా తెలిసినట్టు పార్లమెంటులో మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ తెలంగాణను ఆంధ్రలో తిరిగి కలుపుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు.

### నేడు నిరసన

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ ఓబిసి విభాగం ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహానికి ఆరడుగుల రాజ్యాంగ ప్రతిని సమర్పించనున్నట్టు ఆ విభాగం చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

### నేడు రేవంత్ ఫిర్యాదు

సోమవారం ఉదయం 11 గంటలకు టీపీసీసీ అధ్యక్షులురేవంత్ రెడ్డి, షబ్బీర్ అలీ, పలువురు ముఖ్య నాయకులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మపై ఫిర్యాదు చేయనున్నారు.

## తెలంగాణ చరిత్రను వెలికి తీసే కృషి

- జూలూరు గౌరీశంకర్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ప్రతి ఊరుకు ఒక చరిత్ర ఉంటదని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆదివారం జూమ్‌వేదిక ద్వారా చరిత్రకారుడు శ్రీరామోజు హరగోపాల్ రచించిన "ఇంద్రదేశం ఒక పురాతన చారిత్రక సందేశం" అన్న పుస్తకాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు విస్మరించిన తెలంగాణ చరిత్రను వెలికి తీసేందుకు జరుగుతున్న ముమ్మరకృషికి నిదర్శనమే ఈ పుస్తకమన్నారు.


## COUNTRY CLUB HOSPITALITY & HOLIDAYS LIMITED

CIN: L70102AP1991PLC012714
Regd. Office: 'Amrutha Castle', 5-9-16, Saifabad, Opp: Secretariat, Hyderabad – 500063"
Tel: 040-66848888, Fax: 040-66360609 E-mail: contact@countryclubmail.com,
Website: www.countryclubindia.net

**31 డిసెంబర్, 2021తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల నివేదిక**

(రూ.లక్షల్లో)

| క్ర. సం. | వివరాలు | స్టాండ్‌అలోన్ | | | కన్సాలిడేటెడ్ | | |
|---|---|---|---|---|---|---|---|
| | | ముగిసిన త్రైమాసికం | | ముగిసిన సంవత్సరం | ముగిసిన సంవత్సరం | | |
| | | 31-12-2021 | 31-12-2020 | 31-03-2021 | 31-12-2021 | 31-12-2020 | 31-03-2021 |
| 1 | ఆపరేషన్‌ల నుండి మొత్తం ఆదాయం | 1,800.48 | 1,556.14 | 5,229.87 | 1,846.67 | 1,564.33 | 5,337.54 |
| 2 | కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలకు ముందు) | (472.30) | (960.33) | (3,822.78) | (522.66) | (1,028.83) | (4,527.35) |
| 3 | పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | (472.30) | (960.33) | (3,822.78) | (522.66) | (1,028.83) | (4,527.35) |
| 4 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) | (472.30) | (960.33) | (3,822.78) | (522.66) | (1,028.83) | (4,527.35) |
| 5 | కాలవ్యవధి కొరకు మొత్తం సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) | (519.02) | (1,056.40) | (4,146.03) | (2,454.40) | (4,047.34) | (4,879.78) |
| 6 | చెల్లించిన ఈక్విటి వాటా మూలధనం | 3,269.30 | 3,269.30 | 3,269.30 | 3,269.30 | 3,269.30 | 3,269.30 |
| 7 | రిజర్వులు (రివాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి) | 46,871.89 | 47,322.44 | 49,540.71 | 31,866.63 | 35,157.63 | 34,325.63 |
| 8 | సెక్యూరిటీస్ ప్రీమియం ఖాతా | 49,624.72 | 49,624.72 | 49,624.72 | 49,665.52 | 49,665.52 | 49,665.52 |
| 9 | నికర విలువ | 50,744.70 | 53,356.70 | 53,052.70 | 35,572.48 | 38,863.48 | 38,031.48 |
| 10 | బాకీపడిన డెట్ | 27,530.90 | 28,593.48 | 26,852.60 | 27,530.90 | 28,593.48 | 26,852.60 |
| 11 | బాకీపడిన రిడీమబుల్ ప్రిఫెరెన్స్ షేర్లు | - | - | - | - | - | - |
| 12 | డెట్ ఈక్విటీ రెషియో (నికర) | 0.54 | 0.54 | 0.51 | 0.77 | 0.74 | 0.71 |
| 13 | వాటా ఒక్కింటికి రాబడి (రూ.2/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్‌ల కొరకు) బేసిక్ : డైల్యూటెడ్ : | (0.32) (0.32) | (0.65) (0.65) | (2.54) (2.54) | (0.35) (0.35) | (0.69) (0.69) | (2.99) (2.99) |
| 14 | క్యాపిటల్ రీడెంప్షన్ రిజర్వు | - | - | - | - | - | - |
| 15 | డిబెంచర్ రీడెంప్షన్ రిజర్వు | - | - | - | - | - | - |
| 16 | ఇంట్రెస్ట్ సర్వీసు కవరేజీ రెషియో | 0.47 | 0.10 | 0.15 | 0.40 | 0.05 | 0.00 |

**గమనిక:** ఎ) సెబీ (లిస్టింగ్ అండ్ అధర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీలతో దాఖలు చేయబడిన స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ముగిసిన త్రైమాసికం మరియు వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నది సారాంశం. త్రైమాసికం మరియు వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజీ వెబ్‌సైట్స్ అనగా: (www.bseindia.com & www.nseindia.com)పై మరియు ఇవి కంపెనీ యొక్క వెబ్‌సైట్లు: (www.countryclubindia.net) పై కూడా అందుబాటులో ఉంటాయి.

బి) అకౌంటింగ్ విధానాల్లో ఏదేని మార్పుల కారణంగా నికర లాభం/నష్టం, పూర్తి సమగ్ర ఆదాయం లేదా ఏదేని ఇతర సంబంధిత ఫైనాన్షియల్ ఐటం(ల)పై ప్రభావం ఉన్నచో ఫుట్‌నోట్ విధానం ద్వారా డిస్‌క్లోజ్ చేయబడును.

సి) వర్తించునట్లు ఐఎన్‌డి-ఏఏస్ రూల్స్/ఏఎస్ రూల్స్‌ను అనుసరించి లాభం మరియు నష్టాల నివేదికలో మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంలు సర్దుబాటు చేయబడినవి.

For COUNTRY CLUB HOSPITALITY & HOLIDAYS LIMITED
సం/-
వై. సిద్దార్థ్ రెడ్డి
వైస్ ఛైర్మన్, జెఎండి & సిఇఓ
DIN: 00815456

ప్రదేశం: హైదరాబాద్
తేది: 12-02-2022


# ఆశా వర్కర్లు కాదు.. ఆరాధ్య దైవాలు

## వారి పనితీరు అభినందనీయం

- కరోనా కట్టడికి ఫీవర్ సర్వే ఎంతో ఉపయోగపడింది : మంత్రి హరీశ్ రావు




**నవతెలంగాణ-కామారెడ్డిటౌన్(రాజంపేట్)**



కరోనా లాంటి క్లిష్ట సమయాల్లో వైద్య సిబ్బందితో పాటు ఆశా వర్కర్ల కృషి మరువలేనిదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వారు ఆశా వర్కర్లు కాదని, ఆరాధ్య దైవాలని కొనియాడారు. అందుకే వారి వేతనాలను రూ.1500 నుంచి రూ.9750 సీఎం కేసీఆర్ పెంచారని చెప్పారు. బీజేపీ పాలిత ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్‌లో రూ.4వేలు, కాంగ్రెస్ పరిపాలిస్తున్న రాజస్తాన్‌లో సైతం వారికి రూ.4 వేలు మాత్రమే ఇస్తున్నారని గుర్తు చేశారు. గత పాలకులు మూడు నాలుగు నెలలకోసారి వేతనాలు వేసేవారని, ప్రస్తుతం ఒకటో తేదీనే పడుతున్నట్టు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్‌రావు ఆదివారం పర్యటించారు, జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం కామారెడ్డి జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి సందర్శించారు. అధికారులతో మాట్లాడుతూ.. నాణ్యత లోపం లేకుండా ఆస్పత్రి నిర్మించాలని సూచించారు. తదనంతరం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు మొబైల్ ఫోన్ పంపిణీని కామారెడ్డి జిల్లా నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పనిచేసేవారిని కడుపులో పెట్టుకుంటామనీ, పని చేయలేని వారిని సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మెరుగైన వైద్య విధానం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశాలకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. వైద్య రంగంలో విశిష్ట సేవలకు గాను జాతీయ స్థాయిలో కామారెడ్డి జిల్లాకు కాయాకల్ప అవార్డు రావడం చాలా సంతోషమన్నారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ చాలా తక్కువగా ఉంటుందనీ, దాన్ని మెరుగు పరుచుకోవడానికి సిబ్బంది పట్టుదలతో పని చేయాలని సూచించారు. డెలివరీ కేసులు కామారెడ్డి జిల్లా కేంద్రంలో నాలుగు వందలు మాత్రమే అవుతున్నాయనీ, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని ప్రజలు ఎందుకు పట్టించుకోవడం లేదో పరిశీలించి, లోపం ఎక్కడ జరుగుతుందో సరిచేసుకోవాలని తెలిపారు. జిల్లాలో మొదటి డోస్ వంద శాతం పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డిని టీబీ రహిత జిల్లాగా మార్చాలని దీనికి అందరూ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ గోవర్ధన్ విజ్ఞప్తి మేరకు వంద పడకల ఆస్పత్రికి అదనంగా రూ.10 లక్షలు ప్రకటించారు. అదే విధంగా మరో 150 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని గోవర్ధన్ సూచనల మేరకు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య శాఖ కమిషనర్ కరుణ, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, విప్ గంపగోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, సురేందర్, డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ నిట్టు జాహ్నవి, వైస్ చైర్మెన్ హిందూ ప్రియ తదితరులు పాల్గొన్నారు.